# 15

## సాక్ష్య బలం

సంగమేశ్వరరావు పెళ్ళాం పోయినప్పట్నుంచీ హోటళ్ళలో తినే చాలాకాలం గడుపుకొచ్చాడు. కాని కొంతకాలమయ్యేసరికి మంచి భోజనానికి మొహం వాచిపోయి ఒక వంటవాణ్ణి పెట్టుకుందాం అనుకున్నాడు. వంటవాడి కోసం వాకబుచేశాడు కాని ఎవడూ దొరకలేదు.

'దొరక్కపోతాడా' అన్న ధైర్యంకొద్దీ పప్పూ, బియ్యం వగైరాలు కొనేశాడుకూడాను. కాని వంటవాడు లభించలేదు. ఎవడో ఒకడున్నాడంటే అక్కడకుపోయి వాకబుచేస్తే, వాడు నెలకి ముప్పై జీతం, కాఫీలూ, టిఫిన్లూ ఇచ్చి పెట్టుకుంటే వస్తానన్నాడు. 'ఆ టిఫిను వాడు ఇంటికికూడా పట్టుకుపోతాడు. వాణ్ని నువ్వు

భరించలేవు' అన్నారు మిత్రులు. సంగమేశ్వరం తిరిగివచ్చి, తనే వంట మొదలుపెట్టేడు.

ఎసరుపెట్టి బియ్యం పోశాడు. అన్నం ఉడుకుపట్టింది కాని దాని వాలకం చూసేసరికి, అత్తైసరే బోతుందో, వార్పుకే వస్తుందో తెలిసిందిగాదతడికి. ఆ టైములో సరిగ్గా వీధితలుపు ఎవరో తట్టేరు. ఆయనవెళ్ళి తలుపు తీసేసరికి ఒక నలభై ఏళ్ళ ఆడమనిషి ఒక ఏణ్ణర్థం పసిపిల్లతో ప్రత్యక్షమైంది. ఆయన ప్రశ్నార్థకంగా చూసేసరికి ఆమె, "నేను వంటమనిషినండి. మీకు కావాలని ఎవరో అంటే ఈ యిల్లు కనుక్కువచ్చాను" అంది. సంగమేశ్వరం, 'అయితే ఇలారండి' అంటూ పొయ్యి వద్దకు తీసుకుపోయి అన్నంచూపి, 'ఏం మరామత్తు చెయ్యాలో చెయ్యండి!' అన్నాడు. ఆవిడ మరొక గ్లాసుడునీళ్ళు అన్నంలో పోసి వార్చేసి, ఇత్తడిసిబ్బి మూతపెట్టి, పైన గరిటెడు నిప్పులుపోసింది. 'వంకాయలు లేతవే. కారంపెట్టి వండుతాను. మామిడికాయపచ్చడి చేస్తాను' అంది. ఆయన 'మహాబాగు' అన్నాడు. ఆమె వంట పూర్తిచేసి ఆయన ఆఫీసుకి టైము కాకుండానే 'మడిగట్టుకోండి' అంది. 'కూరలో కారం ఎక్కువ కాలేదుగదాండి...పచ్చడి బాగుందా? మరికాస్త వెయ్యనా?' అంటూ వడ్డించింది. 'అమృతహస్తమమ్మా నీది!' అంటూ హాయిగా భోజనంచేశాడతడు. నాటితో ఆయనకు జిహ్వ లేచివచ్చింది.

రాత్రి భోజనసమయంలో ఆవిడ తన చరిత్ర చెప్పింది. 'ఇది నా మనుమరాలు. కూతురుబిడ్డ. నా కూతురు అత్తింటి

కోత పడలేక నూతిలోపడి చచ్చిపోయింది. ఈ పిల్లని తీసుకుని నేనీ పట్నం పరుగెత్తుకొచ్చాను. నా శాయశక్తులా మీా యింట చాకిరీ చేస్తాను. ఈ పిల్ల భారం నాది. మా యిద్దరి భారం మీాది.'

రెండునెలలు గడిచాయి. ఉన్నట్టుండి ఆరాత్రి కావేరమ్మగారు సంగమేశ్వరంగారితో 'బాబూ, నాకు ఎక్కడైనా మరొక యింటిపని కుదిర్చిపెట్టాలి!' అంది.

'ఏం? ఇక్కడ మీాకువచ్చిన ఇబ్బంది ఏమిటి?' అన్నాడాయన నిర్ఘాంతపోతూ.

'నాకు ఇబ్బందేమీా లేదు. ఇక్కడ పనికూడా తక్కువే. నామీాద అధికారం చెలాయించేవాళ్ళు ఎవరూ లేరు. మీారిచ్చే జీతం కూడా తక్కువకాదు.'

'మరి?'

'ఈ వీధివాళ్లు అనేకవిధాలుగా చెప్పుకుంటున్నారు!'

సంగమేశ్వరం మాట్లాడలేదు. తాను అలా జరుగుతుందని మొదట అనుకున్నదే. ఆ రెండునెలలూ సుఖంగా భోజనం చేశాడు. మళ్ళీ హోటలు తప్పదనేసరికి ఆయనకి బాధగానే ఉంది. కాని ఆవిడ 'ఉండలేను' అంటే 'ఉండ'మనటం ఎలాగ? రెండురోజుల్లో ఆమెకు లాయరు రామచంద్రుడిగారి యింట్లో పనికుదిర్చేడు. తనకు ఆమెస్థానే ముసిలావిడ ఎవరైనా లభిస్తుందేమో అని ప్రయత్నించాడు. రెండుమూడు రోజులు పొయ్యి వద్ద కూచుని చేతులు కాల్చుకుని ప్రాణంవిసిగి మళ్ళీ హోటల్లో తినటం ప్రారంభించాడు.

మరొక నెల గడిచిందో లేదో ఒకనాటి సాయంత్రం ఆయన ఆఫీసునుంచి తిరిగి వచ్చేసరికి ఆమె మనుమరాలితో సహా తాళంవేసివున్న ఇంటిగుమ్మంమీద కనిపెట్టుకొని ఎదురు చూస్తోంది.

'ఏమంపోఁయ్, ఇలా వచ్చారు?'

'ఆ దుర్మార్గుడింట పని మానేశాను బాబూ!'

'రామచంద్రుడిగారినేనా ఆమాట అంటున్నారు?'

'వాడి మొహం మండిరి లెండి! పేరు రామచంద్రుడే గాని, భార్య ఇంట్లో లేకుండా చూసి కీచకుడిమల్లే వెంట పడ్డాడు. నా ఖర్మగాకపోతే వాడికి నా మొహం చూస్తే మోహం పుట్టుకు రావటమేమిటి చెప్పండి?'

సంగమేశ్వరం యాదాలాభంగా ఆవిడకేసి చూశాడు. ఆవిణ్ని అందగత్తె అనటానికి వీల్లేదు. అందగత్తె ఐతేమాత్రం అరవయ్యోపడి సమీపిస్తోన్న రామచంద్రుడికా దుర్బుద్ధి పుట్టడమేమిటి?

'ఏమీలేనిచోట పుకార్లు పుట్టించింది లోకం. ఇది సహించలేక మరోచోటు చూసుకుంటే అక్కడ ఈ ముప్పు ఎదురైంది!...చచ్చేదాకా ఇంక మీ ఇల్లే కనిపెట్టుకుని ఉందామని నిశ్చయించుకు వచ్చేశాను. ఇంక ఊరికుక్క లేమను కున్నా నేను లక్ష్యపెట్టను. ఏ కర్రలోపుట్టిన చిచ్చు ఆ కర్రనే కాలుస్తుంది! నాకేం? ఏమిటి, మీ శెలవు?'

'సరే' అన్నాడాయన. 'మళ్ళీ వచ్చిం'దంటే, 'మళ్ళీ వచ్చిం'దని చెప్పుకున్నారు వీధివాళ్లు. 'నేను చెప్పలేదటమ్మా,

మళ్లీ చేరుకుంటుందని. మధ్య ఏదో పేచీవచ్చి, వెళ్ళింది. విడిచి ఉండలేకపోయింది; వచ్చేసింది!' అంది ఒక ఫుల్లాబ్జవదన.

'ఈయనే ఉండలేక రప్పించుకున్నాడేమో, కంచం పోత్తూ మంచంపోత్తూ నాయిరి మరి!' అని నవ్వేసింది మరొక రమణి.

'ఆ ప్లీడరుగారింట ఎలా వెలగబెట్టిందో మరి' అంది వేరొక కన్యకాపరమేశ్వరి.

'ఏమండీ రత్తమ్మగారూ, మీ యింటి వంటావిడ మానేసిందేం?' అని ప్లీడరుగారి భార్యను అడిగేశారు వాళ్ళంతా. ఆమె 'దాని మొహం మండా! దానిగుణం మంచిది కాదమ్మా.పక్షిచిత్రాంగి! మొగవాళ్లు ఎక్కడ పాడైపోతారో అని నేనే పంపేశాను. కొంచెం చేతివాటుతనంకూడా ఉంది లెండి' అని భర్త మానాన్ని కాపాడింది.

## 2

ఐదేళ్ళు గడిచాయి. సంగమేశ్వరంగారు రిటైరయ్యాడు. కావేరమ్మకి యాభై నిండి తల నెరిసిపోయింది. ఆ వీధిలో కాపురాలున్నవాళ్ళు ఆలోగా ఎంతమందో బదిలీఐ ఇళ్ళు కాళీచేసి పోవటం, కొత్తవాళ్ళు ప్రవేశించటం జరిగింది. కొత్తగా వచ్చిన వాళ్ళకి ఉన్నవాళ్ళు అందచేసే మొదటి భోగట్టా కావేరమ్మని గూర్చే.

'ఆవిడ ఆయనపెళ్ళామనే అనుకుంటున్నారు కాదూ మీరు?'

'ఔను, కాదా మరి?'

'కాదండీ! వంటలక్క! ఐతేం. పెళ్ళాం కిందే జమ లెండి!—' ఇలాగ వచ్చినవాళ్లందరికీ అక్కడివాళ్ళు ఆమె ఆయన భార్యకాదని ప్రారంభించి, భార్యే అని నిరూపిస్తోండే వారు.

మనుమరాలు కావేరమ్మని 'అమ్మా' అనే పిలిచేది. కావేరమ్మా పిల్లచేత సంగమేశ్వరంగారిని 'మామయ్యా' అని పిలిపించేది. ఆ పిల్ల అలా పిలుస్తోంటే వినపడ్డవాళ్ళల్లా విషపు నవ్వులు నవ్వుకునేవారు.

ఆయన రిటైరు కాకపూర్వం బజారుపని అంతా కావేరమ్మే చేసుకొచ్చేది. రిటైరయ్యాక ఆయనే అంగడి వెచ్చాలికి వెళ్ళేవాడు. ఐనా బోలెడు తీరిక. పేపరూ, పుస్తకాలూ చదువుతో కొంత కాలక్షేపం చేసినా ఇంకా టైముండేది. ఆ పిల్లని కూచోబెట్టి చదువు చెప్పేవాడు. బజారుకు తీసుకెళ్లి పుస్తకాలూ, గౌన్లూ కొనిపెట్టేవాడు. స్కూలుకి వెళ్ళి జీతంకట్టి వస్తూండేవాడు. ఇదంతా చూసినవాళ్ళంతా, 'ఎందుకు చేస్తున్నావో మాకు తెలుసులే!' అని మనస్సులో అనుకొనో, పక్కవాళ్ళతో అనో ఆనందించుకునేవారు.

మీనాక్షికి పదకొండు వెళ్లి పన్నెండో యేడు వచ్చింది. కావేరమ్మ, 'ఇంక దీనికీ ఏదో సంబంధం చూసి పెళ్లి చెయ్యాలి' అనుకుంది. 'చదువు మాన్పించి, పనీ పాటూ నేర్పాలి' అని ఆమె అనుకుంటే, 'తీరికూర్చుని చదువు మాన్పించటం దేనికి?' అని ఆయన ఆ పిల్లకి సెకండుఫారం బుక్కులు కొని ఇచ్చాడు.

ఒకనాడొక సాముద్రికుడు వచ్చి సంగమేశ్వరంగారి చెయ్యి చూస్తానన్నాడు. 'అరవయ్యేళ్ళు నిండేయి, నాకు సాముద్రిక మేమిటికి? ఈ పిల్ల చెయ్యి చూడండి' అని మీనాక్షి చేతిని చాపించాడు. 'మీ పిల్ల అదృష్టమంతురాలు; గొప్ప ఉద్యోగస్థుడి భార్య కాబోతోంది' అన్నాడా దైవజ్ఞుడు. ఆ పిల్ల ఆయనకుమార్తె అన్నభావంతోనే అన్నీ మంచిఫలితాలే చెప్పేడా కార్తాంతికుడు.

ఒక్క పదిరోజులు గడిచాయి. సంగమేశ్వరంగారు ప్రొద్దుటే లేచి స్నానంచేసి, తల తుడుచుకుంటూ, గోడకి వ్రేలాడుతోన్న కృష్ణుడిపటాన్ని చూస్తూ—

'కృష్ణ, త్వదీయ పదపంకజ పంజరాన్త
మద్యైవ మే విశతు మానసరాజహంసః
ప్రాణప్రయాణసమయే కఫవాత పిత్తైః
కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తే.'

అన్న శ్లోకం చదివేడు. అప్పుడాయనకి 'ఇంక మనం ఈ ఆస్తిపాస్తుల్ని గూర్చి ఏదో ఒక ఏర్పాటుచెయ్యటం మంచిది' అన్న తలపు వచ్చింది. 'రేపు ఆదివారం గనక ప్లీడరు కాళీగా వుంటాడు. ఆతనితో సంప్రదించి వీలునామా వ్రాయించాలి' అనుకున్నాడు.

కాని ఆయనకా శనివారం గడవలేదు. మధ్యాహ్నం భోజనానికి లేద్దామనుకుంటూంటే గుండెలో యేదో బాధ కింద బయల్దేరి, కాస్సేపు స్తిమితపడితే అదే తగ్గిపోతుందనుకుని సోఫాలో చతికిలపడ్డాడు. కాని వేదన అంతకంతకి ఎక్కువై

మరో ఐదునిముషాలకి మరణవేదనగా మారి డాక్టరుకి కబురు వెళ్ళకుండానే ప్రాణంపోయింది. డాక్టరొచ్చి, 'హార్టు అటాకు—' అని చావుకి కారణం చెప్పేడు.

మూడోనాటికి చిట్టిపంతు లనేఆయన వచ్చి తలుపు తట్టేడు. ఈ పంతులు పట్నం ప్లీడర్లకి కేసులు వప్పగించే పల్లెటూరు లౌక్యుడు. ఎవడి వ్యవహారమో ఒకటి నెత్తిన పెట్టుకుని తరుచూ పట్నం వస్తూనేవుంటాడు. ఈయనకీ, సంగమేశ్వరంగారికీ ఒక పెళ్లిలో పరిచయమైంది. దాన్ని పురస్కరించుకొని సుమారు నాలుగైదుసంవత్సరాలనుంచి పట్నం వచ్చినప్పుడల్లా ఆయన సంగమేశ్వరంగారింటే బసచేసి, ఆప్త బంధువుకుమల్లే కబుర్లు చెపుతో భోజనంచేసి వెడుతోండేవాడు. ఆయన పదిరోజులక్రితమే వచ్చివెడత. కావేరమ్మ తలుపు తియ్యటంతోనే, 'ఏవమ్మా, అలాగున్నావ్?' అని, సంగతి తెలుసుకుని, 'అయ్యో, ఎంతపని జరిగింది? మొన్న నేను వచ్చినప్పుడు యెంతో ఆదరించి గంటలతరబడిని మాట్లాడేడు. పోయాడంటే నమ్మలేకుండా వున్నాను' అన్నాడు.

సుష్టుగా భోజనంచేసి ఒకకునుకుతీసి లేచి చిట్టిపంతులు కావేరమ్మగారితో, 'ఐతే పిన్నీ, వాళ్ళవాళ్ళెవరైనా వచ్చారా?' అన్నాడు.

'వాళ్ళవాళ్ళెక్కడున్నారో నాకు తెలియదు. ఈయన పోయినట్లు ఇవేళ పేపర్లో పడిందిట. అదిచూసుకుని ఎవరైనా వస్తే రావచ్చు' అంది కావేరమ్మ.

పంతులు మెల్లిగా, 'ఐతే పిన్నీ, సంగమేశ్వరంబాబు విల్లూ గట్రా రాశాడా?' అన్నాడు.

'ఏమో, ఆ సంగతి నాకేమీ తెలీదు.'

'తెలీదనేస్తా వేమిటమ్మా? రేపు వాళ్ళొచ్చి కాగితా లన్నీ వెతికి ఆ వీలునామా దొరకబుచ్చుకుని వాళ్ళకి వీలుగా లేకపోతే దాన్ని చింపేసి నీకూ, నీ పిల్లకీ సున్నా చుడతారు!'

'అంటే?'

'పెరటిదారిని ఉన్నట్టు మాట్లాడుతున్నా వేమిటింకా? ఆ విల్లులో ఈ ఇల్లూ గట్రా నీకు చెందేటట్లు రాసివుంటా డాయన.'

'నాకెందుకు రాస్తాడు?'

'తెలియనిదానిలా మాట్లాడుతున్నావే! నాకు చెప్పటం ఇష్టంలేకనా?'

'ఇష్టం లేకపోవడమేమిటి? నాకు ఏనెలకా నెల ఆయన జీతం ఇచ్చేశాడు. ఇంక ఇల్లూ, ఆస్తీ చెందచెయ్యడమేమిటీ అంటాను.'

'వ్యవహారం తెలిసినవాణ్ణిగనక చెబుతా విను. కట్టు కున్న భార్య ఐతే ఏ విల్లూ అక్కర్లేకుండానే ఆస్తి సంక్ర మిస్తుంది. నువ్వు ఆయనకు కట్టుకున్న పెళ్ళాంకన్నా ఎక్కు వగా ఉన్నా, కాయితం ఆధార ముంటే తప్ప ఒక్క సెంటు భూమికూడా నీకు దక్కదు.'

కావేరమ్మకి పంతులుధోరణి అప్పటి కర్థమైంది. కట్టుకున్న పెళ్ళాంకన్నా ఎక్కువగా ఉన్నానా అనుకుని, 'సరే,

లోకంతో బాటే నువ్వూ అనుకుంటున్నావు. తప్పేముందిలే' అన్నట్టుగా ఒక్క చిరునవ్వు నవ్వకుంది. 'అందుచేత, ఆయన నాపేర ఒకవిల్లు రాశాడేమో అంటావ్?'

'రాయక నీకూ, తన కూతురికీ ద్రోహంచేస్తాడా మరి?'

'తన కూతురెవరు?'

'మీనాక్షీమాటే నే చెబుతూంట.'

కావేరమ్మ నిర్ఘాంతపోయింది. 'ఐతే పంతులూ, మీనాక్షి ఆయన కూతురని ఎవరు చెప్పేరు నీకు?'

'అందరూ అనుకుంటూన్నదే. నువ్వీ యింటికొచ్చాకే ఆ పిల్ల పుట్టిందటగా?'

కావేరమ్మ తెల్లబోయింది. పంతులామె తెల్లబోవటం మరోలాగ అర్థంచేసుకుని, 'నీ గోడనలో జోక్యం కలుగజేసుకున్నందుకు ఏమీ అనుకోకు. నే నిక్కడికి వచ్చినప్పుడల్లా నాకు ఆదరించి భోజనంపెట్టేవు గనుక ఆ అభిమానంకొద్దీ నేను చెప్పవలసిన సలహా చెప్పే నంతే. ఆ విల్లు ఎక్కడుందో చూంచి జాగ్రత్తగా పెట్టుకో. సంగమేశ్వరంగారి అన్నకొడుకొక డున్నాడు. వాడిచేతిలో ఆముక్క పడిందంటే నీపని హుళక్కి ఐపోతుంది.' కావేరమ్మ ఆలోచిస్తోనే 'నేను చదువుకున్న దాన్ని గనకనా ఏ కాగితం ఏదో తెలియడానికి? నువ్వే వెతికి పెట్టు' అంది.

పంతులు రికార్డంతా పరీక్షించాడు. విల్లెక్కడా దొరకలేదు. బ్యాంకు ప్యాసుబుక్కు దొరికింది. నాలుగు వేలకి

పై చిల్లర వుందని తేలింది. సంగమేశ్వరంగారికి ఆయన అన్న కొడుకు పాపారావు రాసిన ఉత్తరాలకట్ట ఒకటి దొరికింది. అందులో అంతా దూషణే! పాపారావు డబ్బు పంపవలసిందంటూ సంగమేశ్వరంగారిని కోరినట్లూ, ఆయన పంపకపోవటం వల్ల అతగాడికి కోపంవచ్చినట్లూ ఆ జాబులవల్ల తెలుస్తోంది. 'నాకెందుకు పంపుతావు! అంతా మూటగట్టి ఆ ముండకే యిచ్చుగుంటావుకాని' అని ఒక ఉత్తరంలో పాపారావు కావేరమ్మపైన తన అక్కసు తీర్చుకున్నాడు. 'నువ్వు చస్తే నీకు కర్మ యెవడుచేస్తాడో చూస్తాను! తద్దినాలు ఎవడుపెడతాడో చూస్తాను!' అనికూడా ఆగ్రహం వెలిబుచ్చాడు పాపారావు.

ఇంతగ్రంథం జరిగిందని కావేరమ్మకి పంతులు ఆ ఉత్తరాలు చదివి వినిపిస్తేనే తెలిసింది. 'ఈ పాపారావూ, నువ్వూ, మిగతావాళ్లూకూడా ఈయన తన ఆస్తి అంతా నా పేర రాసేవుంటారనే అభిప్రాయంలో ఉన్నారన్నమాట!'

'అందులో ఆశ్చర్యమేముంది? అలా జరగటం న్యాయంకూడాను.'

'అలైతే ఆయన అలా రాశాడు కాడేం మరి?'

'రాద్దామనుకుంటూ అతాత్తుగా పోయుండాలి. నీతో యెన్నడూ ఈ ప్రసక్తే తేలేదా?'

'లేదు...ఐతే ఇంక ఈ పాపారావు వచ్చి నన్ని ఇంట్లోంచి వెళ్ళగొట్టేస్తాడంటావు?'

'అన్నమాటే.'

కావేరమ్మ ఆలోచించింది. లోకమంతా ఆయన తన్ను

'ఉంచుకున్నా'డనుకునే ఆడిపోసింది. అంతేకాదు, మీనాక్షి తనకూ, ఆయనకూ పుట్టిందనికూడా పుట్టించింది.ఆయన ఆస్తి తనకు రావటం న్యాయమని కూడా అభిప్రాయం బయల్దేరిం దప్పుడే. తను ఇంతగోడూ పడి ఆ ఆస్తి దక్కించుకోకపోవడ మేమిటి? వచ్చిన వాదు చచ్చినా పోదు; ఆ స్తిని పోనియ్యట మెందుకు? మీనాక్షికి సాముద్రికుడు చెప్పినట్లు ఉద్యోగస్థుడు రావాలంటే డబ్బు అవసరం. ఆ పిల్లకు చెప్పబడ్డ అదృష్టం ఇదేనేమో?...ఈ పాపారావుకూడా ఆయననూ, తన్నూ తిట్టిపోసినవాడేగాని ఒక్కనాడు వచ్చి ఆయన్ని చూసినపాపాన పోలేదు. ఈ ఆస్తి వాడికి దక్కటంమాత్రం ఏం న్యాయం?

'ఏమిటమ్మా ఆలోచనలో పడ్డావు?'

'లేని విల్లుకోసం గంటనుంచి శ్రమపడి వెతుకు తున్నావు! ఈ ఆస్తి నాకూ, మా మీనాక్షికీ చెందడం న్యాయ మని నీకే తోచింది గనుక నువ్వు తలుచుకుంటే మా కిది దక్కేటట్లు చెయ్యటం ఎంతపనీ అనుకుంటున్నాను.'

'నేను చేయగలిగిం దేముం దిందులో?'

'ఏముందా? రాతా, కోతా తెలిసినవాడివి! ఆ విల్లేదో నువ్వు రాయలేవూ?'

'రాస్తేమటుకి ఆయన చేవ్రాలో?'

'విల్లంతా రాసినవాడివి చిగుర్ని కాస్త చేవ్రాలే పెట్టలేవూ?'

'సృష్టి చెయ్యమంటావా?' అన్నాడు పంతులు నిర్ఘాంత పోతూ.

'ఈ ఆస్తి మాకు రావటం న్యాయమంటున్నావు గనక! ఇంతకీ నీ శ్రమ వూరికే పోనియ్యనులే. వ్యవహారం చిగురిదాకా చూసిపెట్టు. వెయ్యి, అది చాలదంటే రెండువేలు పుచ్చుకో. ఎన్ని దావాలలో పనిచేస్తే నీకింత రాను?'

పంతులు ఆలోచించాడు. 'రెండువేలు' అనటంతో నే అతగాడికి కా వ్యవహారమంతా సబబుగానే తోచింది. కాగితం, కలం పుచ్చుకుని ముత్యాలకోవలాంటి దస్తూరీతో విల్లు రాసేశాడు. పడికట్టు మాటలన్నీ తీసిచెప్పగా తేలిన సారాంశమేమిటంటే, 'నా భార్య పోయినప్పట్నుంచీ నావద్దఉండి నాకు అనుకూలవతియై షోడశోపచారాలూ చేస్తూన్న కావేరమ్మకూ, నాకూ ఆమెకూ కలిగిన మీనాక్షికీ నా స్వార్జితమైన యిల్లూ, బ్యాంకులో సొమ్మూ, ఇతర చరస్థిరాస్తులూ చెందవలెను' అని సంగమేశ్వరంగారు రాయించినట్లు వుంది. ఎటుతిరిగితే అటు తిరిగే చెయ్యి ఏమో, పంతులే సంగమేశ్వరం చేవ్రాలొకటి ఎదురుగా పెట్టుకొని విల్లుమీద అదేమోస్తరు సంతకం పెట్టేశాడు. ఎక్కడికో పోయి ఇద్దరిచేత చేవ్రాళ్ళు చేయించుకొచ్చాడు.

మరో రెండురోజులకి పాపారావు వచ్చాడు. బ్యాంకుకు వెళ్లి ఏజంటుని చూసి మాట్లాడేసరికి ఆయన 'ఎవరో కావేరమ్మగారు మాకు జాబు రాశారు. సొమ్ముపైన హక్కు-

వారిదిట' అన్నాడు. ఇంటికి వెళ్లి ఏదో రభస చెయ్యబోతే పంతులు ఎదురొచ్చి, 'మిష్టర్, ఇక్కడ అల్లరిచేస్తే ఏం లాభం? కోర్టులో దావాచేసుకో కావలిస్తే' అన్నాడు.

పాపారావు కోర్టులో దావాపడేశాడు. విల్లు సృష్టిఅనీ, కావేరమ్మ వంటలక్క అనీ, ఆమెకూ, ఆ స్త్రీకీ ఏమీ సంబంధం లేదనీ ఆర్గ్యుమెంటు పెట్టించాడు. కావేరమ్మకి ఆ వీధివాళ్ళంతా సాక్ష్యం పలికేరు. 'దేవుని ఎదుట ప్రమాణంచేసి నిజమే చెబుతాం' అని వాళ్ళు నిజమనుకున్నదంతా చెప్పేరు. కావేరమ్మ మొదట సంగమేశ్వర్రావు ఇంటికి మనుమరాల్ని వెంటబెట్టుకొచ్చినప్పుడు ఆ వీధిలో ఉన్నవాళ్లైవరూ ఇప్పుడక్కడ లేరు. మీనాక్షి సంగమేశ్వరంగారికే కలిగిఉంటుందన్న ఊహతో వాళ్ళు తామే పురుడుపోసినట్లుగా బోనులో నిలబడి సాక్ష్యమిచ్చారు. పాపారావు కావేరమ్మను దూషిస్తో సంగమేశ్వరంగారికి వ్రాసిన జాబులుకూడా కావేరమ్మకి సాయపడ్డాయి. ఆమె కన్నివిధాలా సాక్ష్యబలం ఎక్కువై కోర్టువారు పాపారావు దావాను కొట్టివేసి, అతనిచేత ఆమెకు ఖర్చులిప్పించారు.